# కుక్కలున్నాయి జాగ్రత్త!

మొప్పా బాబూరావు

అదే ఇల్లు అవునో కాదో అనుకుంటూ జేబులో ఉన్న అడ్రసు కాయితాన్ని తీసి మరోసారి చూసాను.

గేటు మీదున్న ఇంటినెంబర్, కాయితం మీద రాసున్న అడ్రసు ఒకటే అని తేల్చుకున్నాను మొత్తానికి.

హైదరాబాద్... ఎండాకాలం... మిట్టమధ్యాహ్నం... గంట నుంచి ఎడతెరపి లేకుండా తిరిగితే ఈ ఇంటిని పట్టుకో గలిగాను.

శరీరం మీద చెమట పిల్లఏరులా ప్రవహిస్తోంది.

నాలిక పిడచకట్టుకు పోతోంది.

చెప్పులు పాదాలకి అప్పచ్చుల్లా అతుక్కుపోయాయి.

అరిగిన చెప్పులు... నలిగిన బట్టలు... కళ్లలోని ఆందోళన చాలేమో నేను ఆడపిల్ల తండ్రినని చెప్పుకోవటానికి.

గేటు తలుపు ఎంత ఆలోచించి తయారు చేయించారో ఏమో? గేటు ఎలా తీయాలో అర్థం కావటం లేదు. చాలా గమ్మత్తుగా ఉందనిపించింది.

ఆ కాస్సేపటికే... పెళ్లికొడుకుల ఇంట్లోకి ప్రవేశించాలంటే ముందు వీధి గేటు తలుపులు ఎలా తీయాలో నేర్చుకోవటం ముఖ్యమనుకున్నాను.

ముందు బోలెడు ఖాళీ స్థలం.. ఇల్లు లోపలికి ఉంది.

అక్కడ్నించే పిలుస్తే బాగుండదని గేటుని నెమ్మదిగా కొట్టాను.

ఎటువంటి జవాబు లేదు.

గేటుని మళ్లీ కొట్టాను... ఈ సారి కాస్త గట్టిగా.

ఈ సారి చప్పుడుకి... గేటు దగ్గిరే నిలబడే ఉన్న నన్ను చూస్తూ గట్టిగా అరుస్తోంది మేడమీద నుంచి కుక్క.

కుక్క.... అమ్మో కుక్కే.. కుక్కలంటే నాకు చచ్చేంత భయం. అవి రోడ్డుమీద కనిపిస్తేనే చాలు ఆమడ దూరంలో ఉండే నేను... ఇప్పుడు కనిపించి అరుస్తుంటే నా గుండె ఒక్కసారి ఆగినట్లనిపించింది.

గేటు చప్పుళ్ళకి కాకపోయినా కనీసం కుక్క అరుపులకైనా ఎవరైనా వస్తారేమో అని ఆశగా ఇంటివైపే చూస్తూ నుంచున్నాను.

లాభం లేదు. ఇంట్లోనుంచి ఎటువంటి జవాబు రాలేదు.

తాళంవేసి ఇంట్లోవాళ్లు బయటకెళ్లినట్లు ఆనవాలు ఏమీకనపడటం లేదు. నా గొంతు చాలా పీలగా పక్కవాడికి కూడా వినపడనంత నెమ్మదిగా ఉంటుందంటుంది మా ఆవిడ.

ఇప్పుడు నేను "ఏమండీ" అనిపిలిచిన పిలుపు మా ఆవిడగారు విని ఉంటే ముక్కున వేలేసుకునేది సమయం వచ్చినప్పుడు మా ఆయన కూడా గార్ధభంలా అరవగలడని.

మరి కుక్క మొరుగులే పని చేసాయో?

నా చేతుల చప్పట్లో...

నా నోటి పిలుపో...

మాడ్రన్ గేటు శబ్దమో...

ఏవి పని చేసాయో తెలీదు కాని అదేదో డిటెక్టివ్ పిక్చర్లో కనిపించినట్లు రెండంటే రెండు కళ్లు ఓ కిటికీలో నుంచి క్రిందకి చూడటం నేను గమనించాను. ఇహ నేను మాత్రం ఎటువంటి శబ్దం చేయదలుచుకోలేదు.

మేడమీదున్న కుక్క మాత్రం సీరియల్ నవల్లా అరుచుకు పోతోంది.

ఇంతలో ఒకాయన గదిలోనుంచి తలుపు తీసుకుని బయటకు వచ్చాడు.

"లక్ష్మణరావుగారిల్లు ఇదేనా" గేటు దగ్గర్నుంచె గట్టిగా అరిచాను ఆయన్ని ఉద్దేశిస్తూ.

అక్కడ్నించే లోపలికి రమ్మన్నట్లు చేతో సైగ చేసాడు.

ఆయనే ఉంటే... అన్నట్లు గేటు ఎలా తీయాలో తెలిసి ఛస్తే నేనే లోపలికి వెళ్లి ఉండే వాణ్నిగా.

గేటు తియ్యటం రావటం లేదని సైగ చేస్తూ గేటుని ముందుకి వెనక్కి రెండుసార్లు తోసాను.

ఈ ప్రాక్టికల్స్ ఇందాకే చాలాసార్లు అయ్యాయని బహుశా ఆయనకి తెలిసే ఉండకపోవచ్చుని.

కుక్క పలకరింపులో ఎటువంటి మార్పు లేదు.

కాస్సేపటికి ఓ కుర్రాడు బహుశా పదేళ్లుంటాయేమో... విసుగ్గా మేడదిగి చక చకా నడుస్తూ గేటు దగ్గరికి వచ్చాడు. పని పిల్లాడిలా ఉన్నాడు. చేతిలో తాళం చెవుల గుత్తుంది.

అప్పటిదాకా నేను చూడనేలేదు. గేటు వెనక వైపు తాళం ఒకటి వేసే ఉందని.

రెండు మూడు ప్రయోగాలు చేసి గేటుకి వేసి ఉన్న తాళాన్ని తీసాడు. దుర్భేద్యమైన కంచుకోట సింహద్వారం తెరుచుకున్నంత ఫీలింగ్ కలిగింది నాలో.

ఇందాక చేతులో సైగలు చేసినాయన కాస్త ముందుకు వచ్చినట్లున్నాడు.

సముచితంగా ఆహ్వానించటంలో శునకరాజు ఏ విధమైన లోపం చేయటం లేదు. గుండె దిటవు చేసుకుని నెమ్మదిగా అడుగులు వేస్తున్నాను.

అంతే... కుక్క ఒక్కసారి పై నుంచి మెట్లు దిగి అరుస్తూ నా దగ్గిరకి వచ్చేస్తోంది. నా పై ప్రాణాలు పైనే పోయాయి.

'నో రోవర్... నో... నెమ్మదిగా అన్నాడు పైనే నుంచుని అతను.

ఫరవాలేదు.... మళ్ళీ చేతోనే పైకి రమ్మన్నట్లు సైగ చేస్తున్నాడు.

యజమాని మాట ఏ మాత్రం ఖాతరు చేయక కుక్క నా దగ్గిరకి వచ్చేసింది.

పిల్లఏరులా ప్రవహిస్తున్న చెమట ఇప్పుడు సెలయేరులా పొంగిపోతోంది.

చంటాడు తాయిలం నాకుతున్నట్లు నాలికతో నా చొక్కాని, ప్యాంటుని నాకుతూ నన్ను మెట్లు ఎక్కనిస్తోంది రోవర్.

ఎలాగైతే మెట్ల పర్వం అయిందనిపించాను.

నేను పైకి రాంగానే ఆయన గదిలోపలికి దారి తీసాడు.

నేనూ ఆయన్నే అనుసరించాను.

కుర్చీని చూపించి కూర్చోండని సైగ చేసాడు.

ఇందాక కుక్కని చూసి నేను భయపడుతుంటే 'నో రోవర్ నో' అన్నాడు మూగవాడనటానికి వీలులేదు. మాటలే ఇంత పొదుపుగా ఉన్నాయి. మరి... అనుకున్నాను ఆయన వంకే చూస్తూ.

కుక్క గది బయట బాస్కీటు వేసుకున్నట్లు బైఠాయించింది.

ఇంతకీ ఎవరు మీరు? ఏం పని మీద వచ్చారన్నట్లు మొహం పెట్టాడు ఆయన.

నోటితో కాక మొహంతో మాట్లాడగలడని పించింది ఆయన్ని చూస్తుంటే.

వచ్చిన సంగతి క్లుప్తంగా చెప్పి 'కాస్త మంచి నీళ్లిప్పిస్తారా' అన్నాను ఇక దప్పిక ఆపుకోలేక.

మొహం తుడుచుకుందామని వేంలోనుంచి కర్చీఫ్ తీస్తే అది అప్పుడే నీళ్లలో తడిపినట్లయింది

'అమ్మాయి జాతకం తెచ్చారా'?


ఆయన ప్రశ్నలో

అమ్మాయి కర్త

జాతకం కర్మ

తెచ్చారా క్రియ అన్నట్లు అనిపించింది ఆయన స్వరం

ఇలాంటి ప్రశ్నలు ఈ మధ్యన అడపాదడపా ఎదురౌతున్నాయి కాబట్టి ముందే జాగ్రత్తపడ్డాను క్షణంలో జేబులోనుంచి క్సెరాక్స్ తీయించిన అమ్మాయి జాతకం తాలూకు కాయితం ఒకటి బయటికి లాగాను




అది ఇంకా ఆయన చేతిలో పడనేలేదు 'ఫొటో తీసుకొచ్చారా? అన్నాడు మళ్ళీ

"ఇదే ఊరు కదా! తమరు ఒకసారి చూడ్డానికి వచ్చిపోతే బాగుంటుంది అయినా ఫొటోలో సరిగ్గా తెలీదు కూడా" అన్నాను పిడచకట్టుకున్న గొంతుతో

'అదేం మీరు చెప్పఖ్ఖర్లేదు మాకూ తెలుసు!" అన్నట్లు నుదురు చిట్లించాడు

"ఒసేయి! ఓసారి ఇలారా"! కంగారుగా బాసీటు వేసుకుని కూర్చున్న కుక్కే ఒక్కసారి లేచి నిలుచుంది ఆ కేకకి

బహుశా భార్యని కాబోలు పిలిచింది పాపం చెవిటిదేమో? అనుకున్నాను జాలిపడుతూ

ప్రత్యక్షమైతే దేవత లంటారు!

ఉన్నట్టుండి వెలుస్తే విగ్రహం అంటారు!

కేక విని వస్తే వియ్యపురాలంటారేమో అనిపించింది ఆ క్షణంలో

ఈయనగారికేక ఇంకా లోపలిదాకా పోనేలేదు ఆవిడగారు గుమ్మం దగ్గిర ప్రత్యక్షమైంది

చింతపండు చౌక ధరల్లో అమ్మిన రోజుల్లో పుట్టిందో ఏమో నల్లగా, లావుగా కళాయి పెట్టి కడిగిన బూర్లె మూకుడులా- రోట్లో వేసిన పాత్రంలా ఉంది.

ఆవిడగారు ప్రత్యక్షం అనంగానే కుక్క మళ్ళీ చతికిలబడిపోయింద

"ఆయన పలానట మనబ్బాయి కోసం

వచ్చాడు!" వచ్చాడు పాపం మనింటికి వచ్చాడన్నట్లుంది ఆయన పరిచయ వాక్యాలు

ఆవిడగారు నన్ను నఖశిఖ పర్యంతం చూస్తుంటే నాకు ఏదోలా అనిపించింది

"నమస్కారమండీ" అన్నాను

ఆవిడ అదేమి పట్టించుకోకుండా ' అమ్మాయి ఏం చదివిందన్నారూ?" అంటూ ఓ దీర్ఘం తీసింది

"బి ఎ పాసయిందండీ" అన్నాను నమ్రతగా

"మా అబ్బాయి ఇంజనీర్! తెలుసనుకుంటాను ధీమాగా అంది

మౌనంగా ఆవిడవంకే చూస్తూ తలూపాను

"మీరేం చేస్తుంటారు? మళ్ళీ ఆవిడగారి ప్రశ్న

ఎలక్ట్రిసిటీ బోర్డ్‌లో ఎకౌంటెంట్ నన్నాను జవాబుగా

"ఛీ!ఛీ! అందావిడ

నాతోపాటు ఆయన కూడా ఆవిడవంక ఆశ్చర్యంగా చూసాడు ఏమిటన్నట్లు

బాదగా, బరువుగా తిరుగుతున్న ఫ్యాన్ కాస్త ఆగిపోయింది కరెంట్ కోతకి

ఇంతకీ ఆవిడగారు చీదరించుకుంది నా ఉద్యోగానికా, ఆగిపోయిన ఫ్యాన్ గురించా, నాకు బోధపడలేదు

గాలి ఆడటం లేదు పైగా గొంతు తడారి పోయింది లాభం లేదనుకుంటూ "కాస్త మంచినీళ్ళివ్వండీ ప్రాధేయపడుతున్నట్లడిగాను ఆవిడ వంక చూస్తూ

"ఒరే మల్లిగా' అంటూ ఓ అరుపు అరిచింది

"అమ్మాయి ఎక్కడ చదివింది- ఈ ఊర్లోనేనా? అని మళ్ళీ మొదలెట్టింది

అమ్మాయి బయోడేటా అంతా వల్లించాను ఇహ మల్లిగాడు వచ్చినట్లే మంచినీళ్ళు తెచ్చినట్లే అనుకుంటూ

"మా అబ్బాయికి పిల్ల అందంగా ఉండాలి- గ్రాడ్యుయేట్ అయి ఉండాలి ఉద్యోగం కావాలి ఇంకా ' కంఠస్థం చేసిన సీస పద్యంలా చెప్పుకు పోతోందావిడ

నేనున్నా లేనట్లే అని ఈ పాటికి మీకు తెలిసే ఉంటుందన్నట్లు పిచ్చిగా నా వైపే చూస్తున్నాడాయన

"కంపెనీవాళ్ళే ఫారెన్‌కి పంపిద్దా మనుకుంటున్నారు బహుశా ఈ సంవత్సరంలో వెళ్ళొచ్చు ఈ లోపలే పెళ్ళి చేసేద్దా మనుకుంటున్నాం దేనికో ఉపోద్ఘాతంగా ఉంది ఆవిడ మాట

"చాలా సంతోషం అబ్బాయి ఉంటే ఒక్కసారి పిలుస్తారా అన్నాను

"వాడికేవో పారెన్ పరీక్ష లున్నాయి చదువుకుంటున్నాడు అన్నాడాయన కలగ చేసుకుని


పరీక్షలుంటే బయటికి రాడా ఏమిటి ? తల్లిచాటు బిడ్డేమో పాపం మళ్ళీ ఆ విషయం నేనేమి అడగలేదు

"మీరు అమ్మాయిని చూడటానికి ఒకసారి దయచేస్తే నానుస్తూ అన్నాను

"నిన్ననే చింతలపూడి వాళ్ళొకళ్ళు వచ్చారు ఆ అమ్మాయి పాటో అదీ బానే ఉంది అవును మొన్న వచ్చిన వాళ్ళెవరండీ ' అంది పరధ్యానంగా ఉన్న భర్తని ఉద్దేశిస్తూ

"ఏమో నాకేం తెలుసు? అసలెవరైనా వచ్చారా అన్నట్లు తెల్ల మొహం వేస్తూ పెళ్ళాం వంకే చూస్తుండిపోయాడాయన

ఆ క్షణంలో తలుపు దగ్గిరే మౌనంగా కూర్చున్న కుక్క కూడా ఆశ్చర్యంగా యజమానురాలి వంక చూస్తున్నట్లనిపించింది




"అమ్మాయి ఏం ఉద్యోగం చేస్తోందన్నారు?" మెల్లో గొలుసుని సవరించుకుంటూ అడిగిందావిడ

ఇంటి దగ్గిర్లో- స్కూల్లో టీచరుగా పని చేస్తోందన్నాను!

"ఎన్నాళ్ళనుంచో ! కళ్ళు అదోలా తిప్పుతూ అంది

"ఓ రెండేళ్ళనుంచీ అన్నాను

"జీతం ఏమాత్రం ఇస్తారో?'

భార్య వేసిన ఈ ప్రశ్నకి కుతూహలంగా గడ్డం ముందుకు వంచాడు ఇంటాయన

"నాలుగొందల దాకా

కాస్సేపు మౌనం బహుశా భార్యాభర్త లిద్దరూ నెలకి నాలుగొందలైతే రెండు సంవత్సరాలకి ఎంత సంపాదించి ఉంటుందో అని లెఖ్ఖ కడుతున్నారేమో అనిపించింది

"అబ్బాయి ఫారెన్ వెడతాడు కదా! మరి అమ్మాయి కూడా వెళ్ళాల్సి వస్తుంది ఒక్కతే కూతురంటున్నారు అబ్బాయితో పాటు అమ్మాయి కూడా వెళితే మీకేం అభ్యంతరం ఉండదు కదా!

స్థాణువులా ఆవిడవంకే చూస్తున్నాను

అప్పుడే వీళ్ళబ్బాయితో మా అమ్మాయి పెళ్ళయిపోయినట్లు- అల్లుడు అమ్మాయినిపారెన్‌కి తీసుకెళ్ళి పోయినట్లు ఆ కాస్సేపట్లో ఓ సినిమా రీలు నాముందు తిరిగి పోయినట్లయింది

ఊహాలోకం లోంచి తేరుకుని "ఇందులో అభ్యంతరం ఏముంటుందండీ! పెళ్ళయిన తరువాత అమ్మాయి అబ్బాయితోనే కదా ఉండాల్సింది" అన్నాను సంతోషంగా

గాంధీగారిలా అమాయకంగా నవ్వినట్లుంది ఆయన మొహం

"ఏమండీ! మీరు ఆ విషయం కూడా చెప్పండి కొరకొరా భర్త వంక చూస్తూ అంది

భార్య చెప్పిన ప్రతిదానికి మాటిమాటికి ఉలిక్కి పడితే బాగుండదని గంభీరంగా లేచి ప్రక్కనే టేబుల్ మీదున్న పుస్తకాన్ని తీసుకుని రెండు పేజీలు తిప్పాడు

ఏమిటో ఈ విన్యాసాలు నాకు అంతుపట్టటం లేదు

"అయినంపూడి పెంటపాడు పిఠాపురం ఎరుకలవాడ పత్తివాడ కత్తివాడ- కాకినాడ అంటూ వాళ్ళబ్బాయిని కొనటానికి ఎవరెవరు ఎంతెంత మందొచ్చారో రేట్లతో సహా ఓ పట్టికను చదివి వినిపించాడు

ఆయనవంక చూస్తుంటే నాకే జాలేసింది కనీసం నాకోసం కాకపోయినా ఆయన కోసమైనా ఆ మల్లిగాడెవడో మంచినీళ్ళు ఇప్పటికైనా తప్పక తెస్తాడని ఆరాటపడ్డాను

"ఇంకా ఏ సంబంధం కుదుర్చుకోలేదను కోండి మీక్కూడా తెలుస్తే మంచిదని ఆ పట్టిక

ఆయనగారు వినిపించా రన్నట్లు మొహం పెట్టిందావిడగారు

"మీరమ్మాయిని చూడటానికి వస్తామంటే ఎల్లుండి దశమి మంచి రోజు ఏర్పాటు చేస్తానన్నాను నమ్రతగా

"మేం రావటం- అమ్మాయిని చూడటం ఆ విషయాలు తర్వాత మాట్లాడుకుందాం ముందు వ్యవహారాలు కూడా మాట్లాడుకుంటే " ఏఏ సిట్యుయేషన్‌లో ఎలా ఎలా మాట్లాడాలో అన్న విషయంలో భార్య దగ్గిర బాగా శిక్షణ పొందినట్లున్నాడాయన

"ఆస్తిపాస్తుల గురించి కూడా కాస్త చెప్తే బాగుంటుంది చేతిలోని బంగారు గాజులను సరి చేసుకుంటూ అంది

నా ఆశ్చర్యానికి అంతే లేకపోయింది అమ్మాయి గురించి సంబంధాలు వెదకటం ఈ మధ్యనే మొదలెట్టాను ఆశ్చర్యం ఇప్పటివరకూ ఎవరూ ఇంత డైరెక్టుగా ఈ ప్రశ్న వేయలేదు ఒక్కొక్క చోట ఒక్కొక్క అనుబవం కాని కాని ఇది మరీ వింతగా ఉంది ఈ విదంగా కూడా మాట్లాడేవాళ్ళు, ప్రశ్నించే వాళ్ళుంటారా? నమ్మలేక పోతున్నాను కాని ఇది నిజం నా స్వీయ అనుబవం కాదని ఎలా అనగలను! వినలేదని ఎలా చెప్పగలను?

వాళ్ళిద్దరితో పాటు బయట కూర్చున్న కుక్క కూడా నేనేం చెబుతానో అని చెవులు నిక్కరించుకుంది

ముసుగులో గద్దులాట ఎందుకండి అందరికి ముందే చెబుతున్నట్లు ఈయనకి కూడా చెప్పవలసింది చెప్పండి చేతులో భర్తకి సౌంజ్ఞ చేసింది

"ఆయన నోటితో చెబుతాడా, మొహంతో చెప్తాడా' ఆసక్తిగా ఆయన వంకే చూస్తున్నాను

ఆవిడగారి ప్రశ్నకి నేను జవాబిద్దామనుకుంటుండగానే

"చూడండి! కనీసం రెండు లక్షలైనా ఇవ్వగలిగితే మనం మిగతా విషయాలు మాట్లాడు కోవచ్చు' నిక్కచ్చిగా అన్నాడాయన 'అంతేకదూ' అన్నట్లు భార్యవంక చూస్తూ

కుండ బద్దలు కొట్టినట్లున్నాడో- నాబుర్ర బద్దలు కొట్టినట్లున్నాడో నాకు తెలీదు కాని అనుకోకుండా, ఊహించని విషయం వింటేగాని, చూస్తేగాని నోరు నూగ పోతుందంటారు ఇప్పటి నా పరిస్థితీ అదే అయింది

రెండు నిమిషాల దాకా నోట్లో నుంచి మాటే రాలేదు

రె రె రెండు లక్షలే నత్తి గొంతుతో గొంతు పెగిలింది అదృష్టవంతుణ్ని ఇంకా మూగవాణ్ని కాలేదనుకుని సంతోషించాను

"ఏమిటి ఏమిటలా అయిపోతున్నారు' కాసింత కంగారు ప్రదర్శించారు ఆ పుణ్యాదంపతులు

"అబ్బే! ఏం లేదండీ! నేను రాకూడని చోటికి వచ్చానేమో? ఒక్కసారి గ్రాడేజి కుర్చీలో నుంచి లేచాను

ఇంతకీ మీరు విషయం చెప్పనే లేదు ఆవిడ కూర్చో మంటుందో, తరుముతోందో నా కర్థం కావటం లేదు

"చెప్పండి! మీరెంత ఇవ్వగలరో మామిడిపళ్ళ బండివాడు అడుగుతున్నట్లడిగాడు ఆయన

రేటు విషయం దేవుడి కెరుగు నేను కాస్సేపు అక్కడుంటే పిచ్చాణ్నయినా అవుతానేమో నా నోట్లో నుంచి మాటలు రావటం లేదు ఒక్క దణ్ణం పెట్టి వడివడిగా బయటకు అడుగులు వేసాను

కుక్క తాపీగా కూర్చుని ఉంది కనీసం లేవను కూడా లేవలేదు బాగా అలవాటయిన వాణ్నిలా నన్ను చూస్తోంది

బ్రతుకుజీవుడా అన్నట్లు మెట్లు దిగుతున్నాను

"మాటల్లోపడి మర్చిపోయా, మీరు మంచినీళ్ళు కూడా తీసుకోకుండా పోతున్నారు లోపలికి రండి సావధానంగా మాట్లాడుకుందాం ఆయన రెండు మెట్లు దిగినట్లున్నాడు ఆవిడగారు దిగటానికి ప్రయత్నిస్తోంది

ఇందాక ఇంట్లో ప్రవేశించినప్పుడు కుక్క కనిపిస్తే అది అరుస్తూ నన్ను కరుస్తుందను కున్నాను పాపం అదేమి చేయలేదు నన్ను గదిలోకి దింపి బైట కాపు కాచింది

కాని కాని ఇప్పుడు వీళ్ళు లోపల్నించి బయటకు దాని సహాయం లేకుండానే తరుముతున్నారు

గేటు తలుపు తీసుకుని ఎలాగైతే బయట పడ్డాను

కాలికి ఏదో గట్టిగా తగిలింది

చెక్క బోర్డు తలక్రిందులుగా పడిఉంది


వంగి చేత్తో పైకి తీసాను

బోర్డుమీద కుక్కలున్నాయి జాగ్రత్త అని రాసుంది లోపలికి వచ్చేటప్పుడు నేను అది క్రింద పడున్నట్లు కూడా గమనించ లేదు చెక్క తాకిడికి వేలు నెప్పిగా ఉంది

ఒక్క కుక్క ఉన్నా "కుక్క లున్నాయి జాగ్రత్త అని బహువచనం ఎందుకు వాడతారో ఇప్పుడు నాకు అర్థమైంది ఈ ఇంటి గేటు దగ్గిర "మనుష్యులున్నారు జాగ్రత్త అనే బోర్డు పెడితే సరిగ్గా సరిపోతుందేమో అనిపించి గేటుకి తగిలిద్దామనుకున్న బోర్డుని అక్కడే క్రింద పడేసి వెనక్కి చూడకుండా వడివడిగా ముందుకు అడుగులు వేసాను

●

## అమిత ధనవంతుడైన మైక్



వినోదం కోసం పాప్ సాంగ్స్ పాడి ప్రముఖ పాప్ సింగర్‌గా పేరుబడిన మైకేల్ జాక్సన్ ప్రపంచంలోనే ధనవంతుడైన వినోదకారుడు అవుతున్నాడు తన పాప్ సాంగ్స్ కార్యక్రమాల ద్వారా 1989 సంవత్సరంలో 65 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించాడట.

1988-89 లో ఈ కార్యక్రమాల వల్ల అతనికి 125 మిలియన్ డాలర్ల ఆదాయం లభించింది. కేవలం వినోదం మీదే యింత ఆదాయం సంపాదించి ధనవంతులైనవారు 40 మంది వున్నారట. ఈ ధనవంతుల జాబితాలోకి రాక్ మ్యూజిక్ సింగర్స్ కూడా చేరి పోతున్నారు

31 సంవత్సరాల వయసులోనే యింత ఆదాయం సంపాదించి ఖ్యాతి గడిస్తున్నాడంటే మైకేల్ పాప్ సాంగ్స్‌ను జనాలు ఏ విధంగా ఆదరిస్తున్నారో విదితమవుతుంది

గాయకులతో పాటు కార్టూనిస్టులు, ఆటగాళ్ళు కూడా ధనవంతుల లిస్టులోకి ఎక్కి పోతున్నారట. మరి జనం విరగబడి చూస్తుంటే వాళ్ళు ధనవంతులు కాకపోతారా?!